సాక్షి
సూర్యాపేట
శనివారం। 6। మే। 2023



తప్పుడు నివేదికలతో దోపిడీ
మిర్యాలగూడలో కొంత మంది వైద్యులు రోగులకు తప్పుడు రిపోర్టులు ఇచ్చి దోపిడీకి పాల్పడుతున్నారు. - 8లో



బుద్ధ జయంతి వేడుకలు..
నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో బుద్ధ జయంతి వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. - 10లో

గరిష్టం/కనిష్టం
35°/26°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మొక్కలను సంరక్షించాలి



అర్వపల్లిలో హైవే వెంట నాటిన మొక్కలకు నీళ్లు పెడుతున్న డీఏఓ రామారావునాయక్

అర్వపల్లి: హరితహారంలో భాగంగా సూర్యాపేట– జనగామ, నకిరేకల్– తానంచర్ల రెండు జాతీయ రహదారుల వెంట పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి రామారావునాయక్ కోరారు. శుక్రవారం గ్రీన్‌డేలో భాగంగా కుంచమర్తి, అర్వపల్లిలో హైవే వెంట మొక్కలకు నీళ్లు పోసి సంరక్షణ పనులు చేపట్టారు. మొక్కలను పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీఓ ఉపేందర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, మాగి నాగయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా భవ్య



అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవ్యకు స్వాగతం పలుకుతున్న బార్ అసోసియేషన్

కోదాడఅర్బన్: కోదాడ కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వచ్చిన భవ్యకు శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోదాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాధు శరత్‌బాబు పుష్పగుచ్ఛం అందజేశారు. నిజామాబాద్‌లో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న భవ్య కోదాడకు బదిలీపై వచ్చారు.

ఫార్మా కంపెనీని సీజ్ చేయాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పట్టణం పరిధిలోని సువెన్ ఫార్మా కంపెనీని సీజ్ చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సూర్యాపేటలో కంపెనీ కోసం అతి తక్కువ ధరకు భూములు ఇచ్చిన గిరిజన రైతులను పట్టించుకోకుండా రూ.6,500 కోట్లకు కంపెనీని వేరే వాళ్లకు అమ్ముకొని ప్రజలకు అన్యాయం చేశారని ఆరోపించారు. 6నెలల క్రితం ఆ పార్టీ ఆధ్వర్యంలో సువెన్ ఫార్మసీని సీజ్ చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసినా నేటి వరకు ఎవరు పట్టించుకోలేదన్నారు. సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, నాయకులు నాగన్న, నరసన్న, రామోజీ, రేణుక, శైలజ, పద్మ పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టు వంతెనపై రాకపోకలు నిషేధం

హుజూర్‌నగర్ (చింతలపాలెం): మండలంలోని పులిచింతల ప్రాజెక్టు వంతెనపై రాకపోకలు నిషేధించినట్లు స్థానిక పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు 16నంబర్ గేట్ మరమ్మతులు చేస్తున్నందున రాకపోకలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మాదిపాడు వద్ద కృష్ణానదిపై బల్లకట్టు కూడా నిలిపివేసినందున ప్రయాణికులు గమనించాలని కోరారు.

ఆశయ సాధనే అమరులకు నివాళి

హుజూర్‌నగర్ : అమరవీరుల ఆశయ సాధనే వారికి మనమిచ్చే నివాళి అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. హుజూర్‌నగర్‌కు చెందిన సీపీఐ నాయకుడు రామిశెట్టి బ్రహ్మం వర్ధంతి సందర్భంగా హుజూర్‌నగర్‌లో నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి ప్రాంగణాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక వ్యత్యాసాలు లేని నవ సమాజ నిర్మాణంలో భాగస్వామిగా బ్రహ్మం జీవితాంతం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు యల్లావుల రాములు, సీనియర్ నాయకుడు జేవీఎస్ ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, పాండు, బాబు, మూర్తి, వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

483 నర్సరీలు.. 58.30లక్షల మొక్కలు

9వ విడత హరితహారానికి సిద్ధం చేసిన అధికారులు

- 475 గ్రామ నర్సరీలు, అటవీ శాఖ ఆధ్వర్యంలోని 8 నర్సరీల్లో మొక్కల పెంపకం
- నిత్యం పర్యవేక్షిస్తున్న సిబ్బంది
- వర్షాకాలం ప్రారంభం కాగానే నాటేందుకు సన్నాహాలు

చిలుకూరు: వర్షాకాలం ప్రారంభంకాగానే 9వ విడత హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలు సిద్ధమయ్యాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన హరితహారం గ్రామ నర్సరీల్లో, అటవీ శాఖ నర్సరీల్లో ఈ మొక్కలు పెంచుతున్నారు. జూన్ చివరిలో తొలకరి వర్షాలు పడగానే మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 483 నర్సరీలు

గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మొక్కలు పెంచేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలో నర్సరీలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో 475 గ్రామ నర్సరీలతో పాటు అటవీ శాఖ ఆధ్వర్యంలో 8 నర్సరీలు.. మొత్తం 483 నర్సరీలు ఉన్నాయి. నర్సరీకి కనీసం అర ఎకరం స్థలం ఉండే



చిలుకూరులో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

విధంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ స్థలాలు, తోటల్లో ఈ నర్సరీలు ఏర్పాటు చేశారు. స్థలాలు లేని 39 చోట్ల ప్రైవేట్ స్థలాల యజమానులకు నెలకు రూ. 1000 కిరాయి ఇస్తూ మొక్కలు పెంచుతున్నారు.

మొత్తం 40 రకాల మొక్కలు..

ప్రతి గ్రామంలో ప్రజలకు మొక్కలు అందుబాటులో ఉండేవిధంగా, వారికి ఏయే మొక్కలు అవసరమో వాటికే ప్రాధాన్యత ఇస్తున్నారు. పండ్లు, పూల మొక్కలు, నీడ నిచ్చేవి తదితర మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. అటవీ శాఖకు చెందిన 8 నర్సరీల్లో 3,30,720 మొక్కలు, హరితహారం నర్సరీల్లో 55 లక్షల మొక్కలు మొత్తం 58,30,720 మొక్కలు పెంచుతున్నారు. ఇందులో 40 రకాల మొక్కలు ఉన్నాయి. ఈ వన నర్సరీలను ఉపాధి హామీ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

జూన్‌లో ప్రారంభిస్తాం



జిల్లాల్లో మొత్తం 483 నర్సరీలు ఏర్పాటు చేశాం. మొత్తం 58,30,720 మొక్కలు పెంచుతున్నాం. వీటిని జూన్‌లో నాటేలా సిద్ధం చేస్తున్నాం. ఈ నర్సరీల్లో 40 రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. నర్సరీలను నిత్యం పరిశీలిస్తున్నాం.
– డాక్టర్ పెంటయ్య, అడిషనల్ పీడీ

అసైన్డ్ భూముల పరిశీలన

హుజూర్‌నగర్: పట్టణ శివారులోని అసైన్డ్ భూములను అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక అధికారులతో మాట్లాడారు. ల్యాండ్‌పూలింగ్ చట్టం ప్రకారం రైతుల నుంచి అసైన్డ్ భూములను తీసుకుని ప్రభుత్వం లేఅవుట్ చేసి విక్రయిస్తుందని తెలిపారు. భూమి ఇచ్చిన రైతులకు లే అవుట్‌లో వెయ్యి చదరపు గజాల స్థలాన్ని అందజేస్తుందన్నారు. సదరు స్థలాన్ని ఆ రైతు క్రయ, విక్రయాలకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందన్నారు. ఆయన వెంట ఆర్డీఓ వెంకారెడ్డి, తహసీల్దార్ జయశ్రీ ఉన్నారు.



అసైన్డ్ భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నిరుద్యోగ జంగ్ సైరన్‌ను విజయవంతం చేయాలి

భానుపురి (సూర్యాపేట): హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ గ్రౌండ్‌లో ఈనెల 8న జరిగే నిరుద్యోగ జంగ్ సైరన్‌ను విజయవంతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి భానుప్రకాష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ కోరారు. శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై, పేపర్ లీక్‌లకు నిరసనగా చేపట్టిన సభకు ముఖ్య అతిథిగా ప్రియాంక గాంధీ వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, బైరు శైలేందర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, తూముల సురేష్ రావు, ధారవత్ వీరన్న నాయక్, పొలగాని బాలు గౌడ్, నాగుల వాసు, చెరుకు రాము, మాణిక్యం, నరేందర్ నాయుడు, నాగు నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కోదాడ: నిరుద్యోగుల నిరసన సభను విజయవంతం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుప్రకాశ్‌రెడ్డి కోరారు. శుక్రవారం కోదాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న, పట్టణ అధ్యక్షుడు రామారావు, రాజేశ్వరరావు, వరప్రసాదరెడ్డి, కోటేశ్వరరావు, బాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

రైతు కూలీలకు ‘కూలీ బంధు’ ఇస్తాం



పోచంపల్లిలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేతపై జీఎస్టీని ప్రభుత్వమే చెల్లిస్తుంది
- రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం
- కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుంది
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- పోచంపల్లి, బీబీనగర్ మండలాల్లో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర

భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. రైతుబంధు మాదిరిగానే భూమిలేని వ్యవసాయ కూలీలకు కూలీ బంధు కింద ఏడాదికి రూ.12వేలు ఇస్తామని, అలాగే చేనేత వస్త్రాలు, నూలుపై జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే కడుతుందని సీఎల్పీ నేత భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం, ముగ్దుంపల్లి, గుర్రాలదండి, భట్టుగూడెం నుంచి భూదాన్ పోచంపల్లి మండలంలోని పెద్దరావులపల్లి, గౌస్‌కొండ, రేవనపల్లి గ్రామాల మీదుగా రాత్రి పోచంపల్లి పట్టణానికి చేరుకుంది. స్థానిక నేతాజీ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. అంతకుముందు గొల్లగూడెం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులును సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు రూ.2లక్షల లోపు రుణమాఫీని ఏకకాలంలో చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. రైతులకు ఇస్తున్నట్లు గానే చేనేత కార్మికులకు పథకాలు వర్తింప చేసేందుకు కృషిచేస్తామని, ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి పేదవాడికి ఇంటి స్థలం, ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు, ఇంట్లో ఇద్దరికి ఆసరా పింఛన్లు ఇస్తామని, గ్యాస్‌సిలిండర్‌ను రూ.5వందలకే ఇస్తామని చెప్పారు. పెద్ద ఎత్తున ఉద్యోగాలను భర్తీ చేస్తామని, అప్పటివరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర సంపదంతా కేసీఆర్ కుటుంబంలోని నలుగురే అనుభవిస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో కేసీఆర్‌కు తగిన గుణపాఠం తప్పదని అన్నారు. భువనగిరి నియోజకవర్గంలో యువత ఎంతో చైతన్యంగా ఉందని, రాబోయే ఎన్నికల్లో భువనగిరి కోటపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భూదానోద్యమం జరిగిన పవిత్ర గ్రామాన్ని సందర్శించడం తన అదృష్టంగా భావిస్తున్నానని భట్టి చెప్పారు. మూసీ కాలుష్యంతో ప్రజలు సాగు, తాగునీటికి ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదని, మూసీ ప్రక్షాళనపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో బునాదిగాని కాల్వ నిర్మాణం చేపట్టడం ద్వారా ఈరోజు రైతులకు సాగు నీరు అందుతుందని అన్నారు. రూ.5 లక్షల కోట్ల అప్పులు చేసినా ప్రభుత్వం కనీసం ప్రజలకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు, యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా ప్రశ్నపత్రాలను అమ్ముకొన్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవా చేశారు. ఆయా గ్రామాలలో భట్టివిక్రమార్కకు ప్రజలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భట్టికి నాగలిని బహూకరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, బీర్ల అయిలయ్య, తంగెళపల్లి రవికుమార్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తడక వెంకటేశం, నూతి రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు పాక వెంకటేష్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, వెంకటేశం, సామ మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం



మట్టపల్లి క్షేత్రంలో తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా గజ, సింహ, శేషవాహనాలపై కల్యాణ మండపానికి వస్తున్న శ్రీస్వామి, అమ్మవార్లు. చిత్రంలో పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, రజిత దంపతులు

ధాన్యం దిగుమతులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట రూరల్: ధాన్యం దిగుమతులను వేగవంతంగా చేయాలని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట మండలం పిల్లలమర్రిలోని నాగార్జున పారాబాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని వెంటనే మిల్లుల్లో దిగుమతి అయ్యేలా మిల్లుల యాజమాన్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లుల వద్ద హమాలీల సంఖ్యను పెంచి వేగంగా ధాన్యం దిగుమతులు అయ్యేలా చూడాలన్నారు. జిల్లా ప్రత్యేక అధికారులు కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు మిల్లులో 38వేల బస్తాలు దిగుమతి చేసుకోవడం జరిగిందని మిల్లు యజమాని కొత్త ఆంజనేయులు కలెక్టర్‌కు వివరించారు. తమ మిల్లుకు కేటాయించిన ధాన్యాన్ని సకాలంలో దిగుమతులు పూర్తి చేస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జ్ డీఎస్ఓ పుల్లయ్య, డీటీసీఎస్ నాగలక్ష్మి, ఆర్ఐ హాసన్‌మహ్మద్, సిబ్బంది తదితరులున్నారు.



మిల్లులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నాణ్యత పేరుతో మిల్లర్ల కొర్రీలు

- ధాన్యం అమ్ముకునేందుకు అన్నదాతల ఇబ్బందులు
- బస్తాకు కేజీ నుంచి 4 కేజీల వరకు తరుగు తీస్తున్న మిల్లర్లు
- క్వింటాకు రూ.140 వరకు నష్టం

కోదాడరూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకుందామంటే నాణ్యత పేరుతో కాంటా అయిన తర్వాత రైతులకు మిల్లర్లు నానా కొర్రీలు పెడుతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉందని తాలు కూడా ఉందంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రెండు రోజుల కిందట తమ్మర శివారులో గల ఓ మిల్లులో అనంతగిరి మండలం మొగలాయి కోటకు చెందిన రైతులను ఇదేవిధంగా ఇబ్బందులకు గురిచేశారు. కొనుగోలు సెంటర్లలో ధాన్యం తేమ శాతం 16 చూపెట్టినప్పటికీ.. కొన్ని మిల్లుల వద్దకు వెళ్లిన తర్వాత మరోమారు చూసి తేమశాతం 17, 18 ఉందని, తూర్పారా పట్టకుండా తెచ్చారని, తాలు కూడా ఉందని సాకులు చెబుతూ దిగుమతి చేసుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. బస్తాకు రెండు నుంచి నాలుగు కేజీల వరకు తరుగు తీస్తేనే దింపుకుంటామని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. చేసేదేమీ లేక మిల్లుకు తీసుకుపోయిన ధాన్యాన్ని వెనక్కి తీసుకురాలేక తరుగు తీసినా అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాంటా వేసిన ధాన్యం బస్తాలు

23 మిల్లుల కేటాయింపు..

గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు కోదాడ మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 2, సహకార సంఘాల ఆధ్వర్యంలో 17 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు 23 మిల్లులను కేటాయించారు.

క్వింటాకు 7 కేజీల వరకు తరుగు..

కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తయిన తర్వాత వారికి కేటాయించిన మిల్లులకు రైతులు ధాన్యం తీసుకుపోతున్నారు. ఆ తర్వాత కొంత మంది మిల్లర్లు ధాన్యం నాణ్యత పేరుతో 40 కేజీల బస్తాకు 2 నుంచి 4 కేజీల వరకు తరుగు తీస్తున్నారు. ఇలా బస్తాకు 3 కేజీలు తరుగు తీసినా క్వింటాకు 7 కేజీల వరకు తరుగు రూపంలో పోతుంది. క్వింటా ధాన్యం మద్దతు ధర రూ.2060 ఉండగా.. కేజీ ధాన్యం ధర రూ.20.60 పైసలు అవుతుంది. ఇలా చూసుకున్నా.. క్వింటాకు రూ.140 వరకు రైతులు నష్టపోవాల్సి వస్తుంది. ఎకరానికి అటుఇటుగా 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా రైతులు రూ.3500 వరకు నష్టపోతున్నారు.

తరుగు తీస్తే ఫిర్యాదు చేయండి

ధాన్యం నాణ్యతగా ఉన్నప్పటికీ మిల్లర్లు తరుగు తీస్తే సివిల్ సప్లయ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలి. మిల్లర్లు తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా సకాలంలో దిగుమతి చేసుకోవాలి. రైతులకు ధాన్యం విక్రయంలో ఏదైనా సమస్య తలెత్తితే జిల్లా హెల్ప్‌లైన్ నంబర్ 6281492368కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.
– ప్రసాద్, సివిల్ సప్లయ్ ఆర్ఐ

విజ్ఞాన కేంద్రాలు యువతకు మార్గదర్శకాలు



విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న చెరుపల్లి సీతారాములు

రామన్నపేట : విజ్ఞాన కేంద్రాలు యువతకు మార్గదర్శకాలుగా నిలుస్తాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పేర్కొన్నారు. రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. యువత సన్మార్గంలో పయనించడానికి విజ్ఞాన కేంద్రాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, మేక అశోక్‌రెడ్డి, బొడ్డుపల్లి వెంకటేశం, జంపాల అండాలు, తొల్పునూరి శ్రీనివాస్ విజ్ఞాన కేంద్రం నిర్మాణకమిటీ కన్వీనర్ తొల్పునూరి చంద్రశేఖర్, ఉంబ్రాతి నర్సింహ, ఎండీ మైనొద్దీన్, తాళ్లపల్లి జితేందర్, జోగుల శ్రీనివాస్, బూడిద భిక్షం పాల్గొన్నారు.

కేజీబీవీల్లో పరస్పర బదిలీలు

- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 18 కేజీబీవీల్లో పనిచేస్తున్న 347 మంది సిబ్బంది

సూర్యాపేటటౌన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పరస్పర బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. శనివారం ఖాళీల జాబితా ప్రకటనతో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. 6వ తేదీ నుంచి 9 వరకు ఆన్‌లైన్‌లో బదిలీల దరఖాస్తులకు అవకాశం కల్పించింది. దీంతో ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తూ బదిలీ కోసం ఎదురుచూస్తున్న వారికి స్థానచలనం కలగనుంది.

రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకొని..

జిల్లాలో 18 కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఉండగా.. బోధన, బోధనేతర సిబ్బంది మొత్తం 347 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 18 మంది ఎస్ఓలు, టీచింగ్ సిబ్బంది 129 మంది, పీఈటీలు 17 మంది, నాన్ టీచింగ్ సిబ్బంది 183 మంది ఉన్నారు. బోధన సిబ్బందిలో ఎస్ఓ, సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీ, పీఈటీలు, బోధనేతర సిబ్బందిలో ఏఎన్ఎంలు, అకౌంటెంట్‌లు, అటెండర్లకు పరస్పర బదిలీలకు అవకాశమిచ్చారు. అయితే ఇందులో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకొని ఖాళీలు ఉన్న చోట కోరుకోవడంతో పాటు పరస్పర అంగీకారంతో ఒక చోటు నుంచి మరో చోటుకు సబ్జెక్టుల వారీగా ఆయా కస్తూర్బాలకు బదిలీ అయ్యేందుకు వెసులుబాటు కల్పిస్తూ షెడ్యూల్ విడుదల చేశారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

6వ నుంచి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. 10, 11తేదీల్లో డీఈఓ కార్యాలయంలో దరఖాస్తుల అందజేత, 12 నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, 16న పాయింట్లతో కూడిన జాబితా విడుదల ఉంటుంది. 17 నుంచి 19వ తేదీల్లో అభ్యంతరాల పరిశీలన, 20న తుది జాబితా విడుదల, 21, 22 తేదీల్లో వెబ్ ఆప్షన్లు, 23, 24వ తేదీల్లో వెబ్ ఆప్షన్ల పరిశీలన, 25, 26 తేదీల్లో అలాట్‌మెంట్, 27 నుంచి 29వ తేదీ వరకు బదిలీల ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

తరుగు పేరిట టోకరా

నూతనకల్: బియ్యం బస్తాల్లో వస్తున్న తరుగు పేరుతో రేషన్ డీలర్ లబ్ధిదారులకు టోకరా పెట్టబోగా సరైన తూకం మేరకు బియ్యం ఇవ్వాలని నిలదీశారు. ఈ సంఘటన నూతనకల్ మండల పరిధిలోని యడవెల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామ రేషన్ డీలర్ కొంతమంది లబ్ధిదారులకు 50కేజీల బియ్యం ఇవ్వాల్సి ఉండగా.. తూకం వేయకుండా 50 కేజీల బస్తాను తీసుకెళ్లాలని సూచించాడు. అయితే లబ్ధిదారుడు బస్తాలో బియ్యం తక్కువగా ఉన్నాయనే అనుమానంతో తూకం వేయగా 43కిలోలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన 7కిలోల బియ్యం ఇవ్వాలని డీలర్‌ను కోరగా గోదాం నుంచి వచ్చిన బస్తాలే తీసుకోవాలని తరుగు ఎవరు భరిస్తారు..? అని చెప్పడంతో లబ్ధిదారులు తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్‌కు సమాచారం ఇచ్చారు. లబ్ధిదారులకు బియ్యం తూకం వేసి ఇవ్వాలని, తరుగుకు లబ్ధిదారులకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. తూకం వేయకుండా బియ్యం బస్తాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రేషన్ డీలర్‌ను హెచ్చరించారు.



తూకం తక్కువగా ఉన్న బియ్యం బస్తా

క్లుప్తంగా

తిమ్మాపురం పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం చోరీ

అర్వపల్లి: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో దొంగలు ఓ కౌలు రైతు ధాన్యాన్ని చోరీ చేశారు. గ్రామానికి చెందిన కొణతం చక్రారెడ్డి పది ఎకరాల భూమిని సూర్యాపేట మండలం బుర్కపిట్టతండాకు చెందిన బానోతు హుస్సేన్ కౌలుకు తీసుకొని వరిసాగు చేశాడు. ఇటీవల వరిపంట కోసి సుమారు 300 బస్తాల ధాన్యం రాగా గ్రామంలోని పీఏసీఎస్ కేంద్రంలో పది రోజుల కిందట తెచ్చి అమ్మకానికి రాశి పోసి ఉంచాడు. అయితే గురువారం అర్ధరాత్రి దాటక కేంద్రంలో రైతులు ఎవరూలేని సమయంలో సుమారు 100 బస్తాల వరకు ధాన్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. శుక్రవారం ఉదయం రైతు హుస్సేన్ కేంద్రానికి వచ్చాక రాశిని చూడగా కొంత ధాన్యం చోరీ అయినట్లు గుర్తించాడు. దీంతో కౌలు రైతు హుస్సేన్ బోరున విలపించారు. ధాన్యం చోరీతో సుమారు రూ.80వేల వరకు నష్టం జరిగిందని పేర్కొన్నారు.

నంబర్ ప్లేట్‌లేని 9 వాహనాలు సీజ్


పట్టుబడిన వాహనాలతో సీఐ ఆంజనేయులు, సిబ్బంది

కోదాడరూరల్ : నంబర్ ప్లేట్‌లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని పట్టణ సీఐ ఆంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న 9 ద్విచక్రవాహనాలు సీజ్ చేసి మాట్లాడారు. వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేయాలని అన్నారు. వాహనాలకు విధిగా ఆర్‌సీ , ఇన్సూరెన్స్, డ్రైవింగ్‌లైసెన్స్ సంబధిత పత్రాలు తప్పకుండా ఉండాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించే వాహనాలు నడిపితే ఎంతటి వారైన చర్యలు తప్పవని అన్నారు.

తేమ లేకుండా అరికట్టాలి

సంస్థాన్ నారాయణపురం: రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని డీపీఎం అనురాధ సూచించారు. గుడిమల్కాపురం, సంస్థాన్ నారాయణపురం, వెంకబావితండాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు.ఆమె వెంట ఏపీఎం ఉమారాణి, ఏఈఓలు రవితేజ తదితరలున్నారు.

నిధుల వినియోగంపై అవగాహన


మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

భువనగిరిటౌన్ : రూర్బన్ క్లస్టర్ నిధుల వినియోగంపై హ్యాండ్లూమ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో కలెక్టర్ పాల్గొని మంజూరైన నిధులు వినియోగిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన

- శేరిలింగోటం ఐకేపీ కేంద్రంలో ఐదు రోజులుగా నిలిచిన ధాన్యం కొనుగోళ్లపై ఆగ్రహం
- నల్లగొండ–సాగర్ రహదారిపై మొద్దులు, ముళ్ల కంచె వేసి ధర్నా


నల్లగొండ-సాగర్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

కనగల్: మండలంలోని శేరిలింగోటం ఐకేపీ కేంద్రంలో ఐదు రోజుల నుంచి ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో ఆగ్రహించిన రైతులు శుక్రవారం నల్లగొండ–సాగర్ ప్రధాన రహదారిపై పెద్ద మొద్దులు, ముళ్ల కంచెను వేసి ధర్నాకు దిగారు. ఈ ఆందోళనలో గ్రామానికి చెందిన రైతు లచ్చిరెడ్డి. ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని పురుగుల మందు డబ్బాతో నిరసన వ్యక్తం చేశాడు. లారీల కొరత తీవ్రంగా ఉండటంతో పాటు తాలు ఉందని మిల్లర్లు కొర్రీలు పెడుతుండడంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లారీల ద్వారా మిల్లులకు తీసుకెళ్లిన ధాన్యం అక్కడ సకాలంలో దిగుమతి కాకపోవడంతో కొనుగోళ్లు అలస్యమవుతున్నాయన్నారు. కాంటా వేసిన ధాన్యం ఐదు రోజుల నుంచి కేంద్రంలో ఉందని వాపోతున్నారు. ఈ కేంద్రంలో 60లారీల ధాన్యం సేకరించాల్సి ఉన్నా.. నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ధర్నా వద్ద గందరగోళం ఏర్పడటంతో ఎస్ఐ నగేష్, పోలీస్ సిబ్బందితో చేరుకుని రైతులతో మాట్లాడి సద్దుమణిగించారు. రైతుల ధర్నా సుమారుగా గంట పాటు కొనసాగడంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

కేంద్రం నిర్వాహకులపై అదనపు కలెక్టర్ ఆగ్రహం

లారీల కొరతతో పాటు తాలు పేరుతో దిగుమతి కాని లారీల విషయం గురించి నిర్వాహకులు తమ దృష్టికి ఎందుకు తీసుకు రావడం లేదని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రైతులు చేపట్టిన ధర్నా వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం కేంద్రంలో నిలువ ఉంచొద్దన్నారు. రైతులు తాలు లేకుండా తూర్పార బట్టుకుని నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కేంద్రంలో ధాన్యం ఎక్కువగా ఉన్నందున లారీలను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ట్యాబ్ ఎంట్రీ నమోదును వెంటవెంటనే చేయాలని సూచించాడు. ప్రతిరోజు రెవెన్యూ, సివిల్ సప్లయ్ సిబ్బంది కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించి కొనుగోళ్లు సక్రమంగా జరిగేటట్లు చూడాలని ఆదేశించారు. కొనుగోళ్లను వేగవంతం చేస్తామని రైతులకు నచ్చజెప్పడంతో రైతులు ధర్నాను విరమించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ యాదగిరి తదితరులు ఉన్నారు.

తప్పుడు నివేదికలతో దోపిడీ

- ఓ బాలుడికి డెంగ్యూ, మలేరియా ఉన్నట్లు రిపోర్టులు
- హైదరాబాద్ రిపోర్టుల్లో నార్మల్ రావడంతో ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన


వైద్యుడితో వాగ్వాదం చేస్తున్న బాలుడి బంధువులు

మిర్యాలగూడ అర్బన్: రోగుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంత మంది వైద్యులు తప్పుడు రిపోర్టులు ఇచ్చి దోపిడీకి పాల్పడుతున్నారు. తాజాగా మిర్యాలగూడ పట్టణంలో వెలుగు చూసిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి(సాగర్) మండలం సఫావత్‌తండాకు చెందిన సఫావత్ పాండు తన కుమారుడు మధుకార్తిక్‌కు జ్వరం రావడంతో గత నెల 29న డాక్టర్స్ కాలనీలో గల స్టార్ పిల్లల వైద్యశాలకు తీసుకొచ్చాడు. పరీక్షించిన ఆస్పత్రి వైద్యులు కుమార్ బండారు రక్త పరీక్షలు చేయించాలని ల్యాబ్‌కు పంపించాడు. రక్త నమూనాలు స్వీకరించిన అనంతరం పరీక్షల్లో డెంగ్యూ, మలేరియా లక్షణాలతో పాటు బ్లడ్ ఇన్ఫెక్షన్ ఉన్నట్లుగా నిర్ధారించి రిపోర్టు ఇచ్చారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిషమంగా ఉందని సదరు వైద్యుడు చెప్పడంతో భయాందోళనకు గురైన బాలుడి తండ్రి హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడి ఆస్పత్రిలో జరిపిన పరీక్షల్లో ఎలాంటి డెంగ్యూ, మలేరియాతో పాటు బ్లడ్ ఇన్ఫెక్షన్ లక్షణాలు లేవని తేల్చి చెప్పడంతో ఆగ్రహించిన బాలుడి తల్లిదండ్రులు, బంధువులు మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీలోని ఆస్పత్రి వద్దకు చేరుకుని సదరు వైద్యుడిని నిలదీశారు. రక్త పరీక్షల పేరుతో రూ.5వేలకు పైగా వసూలు చేసినట్లుగా బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్య సిబ్బంది ఇచ్చిన తప్పుడు రిపోర్టులతో ఆందోళన చెంది హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు చేయించామని వారు వాపోయారు.


తప్పుడు రిపోర్టులను చూపిస్తున్న బాలుడి తండ్రి

పరీక్షల్లో తేడాలు సహజం : వైద్యుడు కుమార్

బాలుడికి చికిత్స చేయడంలో తన తప్పు ఏమీ లేదు. ఒక్కో సారి రక్త పరీక్షలు తేడాలు రావడం సహజం.

‘వెన్నెల పందిరి’ కార్యక్రమానికి శ్రీకారం


సమావేశంలో పాల్గొన్న కవులు

మోత్కూరు : మోత్కూరు ప్రజా భారతి సాహితి, సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వెన్నెల పందిరి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య పాల్గొని మాట్లాడారు. కవులు తమ రచనలను వినిపించడంతో పాటు వాటి మీద సీనియర్ కవులు సమీక్ష చేసి అందులోని లోటుపాట్లను వివరించడం వల్ల ఎంతో మంది నూతన కవులు తయారవుతారని తెలిపారు. ప్రముఖ సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్ మాట్లాడుతూ మోత్కూరు ప్రజా భారతి చేపడుతున్న ప్రతి కార్యక్రమం ఎంతో ప్రాధాన్యం కలిగి ఉందని అన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి అమ్మ యాది ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెండెం సత్యనారాయణ, ప్రజా భారతి అధ్యక్ష, కార్యదర్శులు దేవినేని అరవిందరాయుడు, గుమ్మడెల్లి వెంకన్న, ప్రధాన సలహాదారు ఎస్.ఎస్.చారి, పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు తొర్ర ఉప్పలయ్య, కె.మహేందర్, టి.మనోహరాచారి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నూతన జడ్జి బాధ్యతల స్వీకరణ

చౌటుప్పల్ : చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన జడ్జిగా మహతి వైష్ణవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తాడూరి పరమేష్, సహాయ కార్యదర్శి జెల్ల రమేష్, కోశాధికారి మహిపాల్‌రెడ్డి, లైబ్రరీ సెక్రటరీ జక్కర్తి శేఖర్, మహిళ ప్రతినిధి స్వాతి ఆధ్వర్యంలో నూతన జడ్జికి స్వాగతం పలికారు. న్యాయవాదులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన జడ్జి మాట్లాడుతూ కక్షిదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, ఊడుగు శ్రీనివాస్‌గౌడ్, తడక మోహన్ పాల్గొన్నారు.


నూతన జడ్జి మహతి వైష్ణవికి స్వాగతం పలుకుతున్న న్యాయవాదులు

ప్రతిభను వెలికితీసేందుకు చిత్రలేఖనం దోహదం


విద్యార్థులకు చిత్రలేఖనం సామగ్రి అందజేస్తున్న జ్ఞాన ప్రకాష్‌రెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు

భువనగిరి : విద్యార్థుల్లో కళను బయటకు తీసేందుకు చిత్రలేఖనం దోహదపడుతుందని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ గడ్డం జ్ఞాన ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాక్షి మీడియా గ్రూప్, రోటరీక్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ సంయుక్తంగా భువనగిరిలోని విజ్ఞాన్ ఐఐటీ క్యాంపస్‌లో చిత్రలేఖనంపై వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనం ఊహకు రూపాన్నిచ్చే ఒక చక్కని సాధనం అన్నారు. మానవుని అభివృద్ధిలోనూ చిత్రలేఖనం ప్రధానమైన కళ అని పేర్కొన్నారు. శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో చిత్రలేఖంపై వేసవి ఉచిత శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం కోసం ఉపయోగించి సామగ్రిని అందజేశారు. సుమారు 55 మంది విద్యార్తులు శిబిరానికి హాజరయ్యారు.అంతకుముందు శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సాక్షి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ యంబ నర్సింహులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి సెంట్రల్ కార్యదర్శి పక్కీర్ కొండల్‌రెడ్డి, కోశాధికారి మహ్మద్ హనీఫ్ మెమన్, మాజీ అధ్యక్షుడు ఎంపల్ల వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు గూడూరు అశోక్‌రెడ్డి, గుమ్ముల మల్లేశం, పగిడాల జలంధర్‌రెడ్డి,శిక్షకుడు, చిత్రకారుడు ఆవుల వినోద్‌కుమార్, ఆర్సీ ఇంచార్జి మాటూరి వెంకటేశ్వర్లు,సాక్షి జిల్లా ఫొటోగ్రాఫర్ కోల్లోజు శివకుమార్, పాఠశాల డైరెక్టర్ పగిడాల పురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి వృద్ధుడి తరలింపు

భువనగిరి : భువనగిరి పట్టణంలోని వరంగల్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై పడి ఉన్న వృద్ధుడిని శుక్రవారం రాయగిరిలోని సహృదయ అనాథ ఆశ్రమ సభ్యులు మహ్మద్ చోటు ఆశ్రమానికి తీసుకెళ్లారు. అనంతరం వృద్ధుడికి వైద్య పరీక్షలు నిర్వహించి నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు ఉన్నారు.

15నుంచి సీఎం కప్ టోర్నమెంట్

భువనగిరి : సీఎం కప్ మండల, జిల్లా స్థాయి క్రీడా టోర్నమెంట్ ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కె.ధనుంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయిలో 5 విభాగాలు, 22 నుంచి 24వ తేదీ వరకు జిల్లా స్థాయిలో 12 విభాగాల్లో క్రీడా పోటీలు ఉంటాయన్నారు. 15 నుంచి 36 సంవత్సరాల మధ్య వయస్సున్న వారు క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి


మాట్లాడుతున్న గూడూరు నారాయణరెడ్డి

భూదాన్‌పోచంపల్లి : చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణకేంద్రంలో చేనేత జనసమాఖ్య ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద చేపట్టిన చేనేత సమస్యల దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు వార్పు కూలి రూ.4వేలు పెంచాలని, చేనేతబంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.అర్హులైన చేనేత కార్మికులందరికీ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం చేనేత జన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం మాట్లాడుతూ చేనేతబీమా పథకంలో చేనేత కార్మికుల వయస్సును 70 సంవత్సరాల వరకు పెంచాలని, జిల్లాలో ఆత్మహత్యలు చేసుకొన్న చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు. మూతపడిన పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును పునః ప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు వేశాల మురళి, ప్రధాన కార్యదర్శి గంజి చంద్రయ్య, చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, బింగి భాస్కర్, గజ్జెల రామకృష్ణ, వడ్డేపల్లి విష్ణు అఖిలపక్ష చేనేత నాయకులు భారత వాసుదేవ్, జోగు శ్రీనివాస్, గంజి బస్వలింగం, ముసునూరి యాదగిరి, ఏలే శ్రీనివాస్, భారత భూషణం, సీత లక్ష్మణ్, ముసునూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు అభివృద్ధిపై ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేదు


మాట్లాడుతున్న పీవీ శ్యాంసుందర్‌రావు

ఆలేరురూరల్ : ఆలేరు అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యేకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, రైల్వే అండర్‌పాస్‌ను నాలుగు సంవత్సరాలుగా పూర్తి చేయించకుండా ప్రజలను నమ్మిస్తూ వస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, రాష్ట్ర నాయకుడు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. రైల్వే అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో 36 రోజులుగా చేస్తున్న దీక్షకు శుక్రవారం వారు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏనాడూ ప్రజలను పట్టించుకోని ఎమ్మెల్యే.. వారి సమస్యలు పరిష్కరిస్తానని ప్రజాదర్బార్ నిర్వహిస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని పేర్కొన్నారు. ఆలేరును రెవెన్యూ డివిజన్ చేస్తానని హామీ ఇచ్చి ఇంత వరకు నేరవేర్చలేదన్నారు. ఆలేరు అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేని ఎమ్మెల్యే గొంగిడి సునీత తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ చెరిగె శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఈఎల్ చరిత్రలో గొప్ప అగ్రిమెంట్

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న గొంగిడి మహేందర్ రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్: ప్రీమియర్ కంపెనీ చరిత్రలో ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా కార్మికులకు 11వ వేతన ఒప్పందం జరిగిందని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దకందుకూరు గ్రామంలోని ప్రీమియర్ కంపెనీ కార్మికులతో, పరిశ్రమ ఆవరణంలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌కేవీ యూనియన్ ఆధ్వర్యంలో కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి, పది, పదకొండు వేతన ఒప్పందాల్లో, కార్మికులకు 11500 రూపాయలు పెంచామన్నారు. ఇంతకు ముందు కార్మికులకు 9 అగ్రిమెంట్‌లు జరిపి యాజమాన్యం కేవలం 9000 రూపాయలు మాత్రమే వేతనం పెంచగలిగిందని తెలిపారు. గతంలో ఏ అగ్రిమెంట్ చేసినా, 20 నెలలు పట్టిందని, ఇప్పుడు కేవలం 12 నెలలో అగ్రిమెంట్ పూర్తయిందని తెలియజేశారు. ఈ అగ్రిమెంట్ ద్వారా ప్రతీ కార్మికుడికి సర్వీస్ వెయిటేజ్,ఎల్‌టీఏతో కలిపి 5261 రూపాయలు పెరిగిందని, సీనియర్ కార్మికునికి రూ.6251 పెరిగిందని తెలిపారు. దీనిలో భాగంగా కంపెనీలో కార్మికుడు చనిపోతే అంత్యక్రియలకు కోసం రూ.15000, ట్రైనీ కార్మికునికి వేతనం, 12000, ఎల్‌టీఏ 750, ఫెస్టివల్ అడ్వాన్స్ 6500 వరకు పెంచామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు ప్రకాశ్ గౌడ్, టీఆర్ఎస్‌కేవీ వర్కింగ్ ప్రెసిడెంట్ జి. రమేష్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ రాజిరెడ్డి, టీఆర్ఎస్‌కేవీ జనరల్ సెక్రటరీ పి. ఆదాం, సిద్దులు, కంపెనీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి


పిల్లలతో కలిసి సమ్మెలో పాల్గొన్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

రామన్నపేట : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సాల్వేరు అశోక్, ఎండీ జమీరొద్దిన్‌లు డిమాండ్ చేశారు. పిల్లలతో కలిసి జూనియర్‌పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు శుక్రవారం మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, శిరీష, స్వరూప, రమేష్, అయ్యప్పరెడ్డి, పవన్‌కుమార్, వేణు, నరేష్, వెంకటేష్, రమాదేవి, లావణ్య, సుధ, మహేష్, విఠల్, ఉపేందర్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

దళారులకు విక్రయించవద్దు

ఆలేరురూరల్ : రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఏడీఏ వెంకటేశ్వర్లు అన్నారు. ఆలేరు మండలంలోని శారాజీపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లను, రికార్డులను పరిశీలించారు. కొనుగోళ్లు జాప్యం కాకుండా చూడాలని, గన్నీ బ్యాగులు, కాంటాలు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ప్రతి గింజ కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడవద్దన్నారు.

పచ్చడి మామిడి ప్రియం !

- ఘాటెక్కిన ఎండు మిర్చి, కారం ధరలు
- పచ్చడిలో ఉపయోగించే నూనె, ఇతర వస్తువుల ధరలూ పెరుగుదల


మామిడికాయ పచ్చడి తయారు చేసుకుంటున్న మహిళలు

సంస్థాన్ నారాయణపురం: ఎన్ని కూరలున్నప్పటికీ పచ్చడి మెతుకులు లేనిది గొంతులోకి ముద్ద దిగదు అన్నట్లుగా నిల్వ మామిడికాయ పచ్చళ్లకి పేరుంది. పచ్చళ్లతో పూట గడుపుకొనే ఎంత మంది పేదవారున్నారు. కాని మామిడికాయ పచ్చడి ప్రియంగా మారింది. మామిడికాయ పచ్చడి తయారీలో ఉపయోగించే ధరలు పెరగడంతో పచ్చడితయ్యారి భారంగా మారింది. గత సంవత్సరంతో పోల్చుకుంటే ధరలు రెట్టింపయ్యాయి.

పెరిగిన ధరలు ఇవే...

మామిడికాయ పచ్చళ్లు వారి అభిరుచికి అనుగుణంగా వివిధ రకాలుగా పెట్టుకుంటారు. మామిడికాయలతో ఉడకబెట్టిన పచ్చళ్లు, కొబ్బరి, వేరశనగకాయ, నువ్వులు, ఆవాలు, అల్లం, తొక్కు గీసిన మామిడికాయలతో పలు రకాలుగా పచ్చళ్లను పెడుతుంటారు. పచ్చళ్ల తయారీలో పలు వస్తువులను ఉపయోగిస్తారు. తయారీలో ఉపయోగించే వస్తువులు గత సంవత్సరం కంటే ప్రస్తుతం భారీగా పెరిగాయి. గత సంవత్సరం 100 మామిడి కాయలతో పచ్చళ్లు పెట్టడానికి రూ.2000 నుంచి 2600 వరకు ఖర్చు కాగా ప్రస్తుతం రూ.3000 వేల నుంచి 7,500 వరకు ఖర్చు వస్తోంది. ధరలు పెరగడంతో గతం కంటే తక్కువ కాయలతో పచ్చళ్ల పెడుతుండగా, మరికొందరు అవసరానికి అనుగుణంగా పచ్చళ్ల కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. కింది పట్టికలో 100 మామిడికాయలతో పచ్చడి తయారు చేయ్యాడానికి సుమారు అయ్యే ఖర్చు వివరాలు.

> **ధరలు భారీగా పెరిగాయి**
>
> 
>
> మామిడికాయ పచ్చళ్ల పెట్టడానికి అవసరమైన వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. మామిడికాయలు కాకుండానే వస్తువులకు రూ.18వందలు ఖర్చు చేయాల్సి వచ్చింది. గతంలో 30కాయలు పచ్చడి పెడితే రూ.వెయ్యి ఖర్చు అయ్యింది.
>
> పప్పుల మల్లిక, జనగాం

కలిసిమెలిసి..

వేసవి కాలం వచ్చిందంటే నిల్వ పచ్చళ్లు పెట్టడం సాంప్రదాయంగా పాటిస్తున్నారు. మామిడికాయ పచ్చళ్లను లక్ష్మీదేవి స్వరూపంగా భావిస్తూ నిష్ఠతో పెడుతారు. వేసవిలో మామిడికాయ, నిమ్మకాయ పచ్చళ్లను ఎక్కువగా పెడుతుంటారు. మామిడికాయ పచ్చళ్లను ప్రాంతం ఆధారంగా పలు పేర్లతో పిలుస్తుంటారు. తెలంగాణ యాసలో మామిడికాయ తొక్కు, ఆంధ్రాలో ఆవకాయ అని పిలుస్తుంటారు. మామిడికాయ పచ్చళ్ళు పెట్టాలంటే కొంత అనుభవం అవసరం. అనుభవం లేకుండా పెడితే పచ్చళ్లు బూజు రావడం, ఉప్పు లేదా కారడం కావడం లేదా రుచి లేకపోవడంతో జరుగుతుంది. అందుకే పద్ధతిగా పచ్చళ్లు పెడుతుంటారు.

ధరల వివరాల పట్టిక

వస్తువు పేరు	గత సంవత్సరం ధర రూ.	ప్రస్తుతం ధర రూ.
1.మామిడికాయ(100)	500-700	700-2000
2. ఎండు మిర్చి (3కేజీల ప్రకారం)	480- 900	900-3900
3. ఎండు కారం (2కేజీలు)	900-1200	1200-1800
4. పల్లి నూనె (4 లీటర్లు)	560-600	560-760
5. అల్లం (2కేజీలు)	40-80	200-260
6. ఎల్లిగడ్డ (2కేజీలు)	60-80	200-300
7. జిలుకర (250గ్రాములు)	65-75	150-200

ఇవే కాకుండా మెంతులు, ఆవాలు, ఉప్పు, వేరుశనగ, కొబ్బరి వంటి వస్తువుల ధరలు స్వల్పంగా పెరగగా మరికొన్ని వస్తువుల ధరలు గత సంవత్సరం మాదిరిగానే ఉన్నాయి.